సాక్షి
హనుమకొండ

ఆదివారం | 23 | జూన్ | 2024



ప్రమాదం.. పసిగట్టొచ్చు

ఇక నుంచి ప్రకృతి ప్రమాదం పసిగట్టొచ్చు. పిడుగు, వర్షాలు, ఈదురుగాలులు లాంటి వైపరీత్యాలను ముందే తెలుసుకోవచ్చు.

- 8లో▸



రూ.529.44 కోట్ల రుణాల మాఫీ

రైతులకు ఇచ్చిన పంట రుణాలు రూ.529.44 కోట్లు మాఫీ కానున్నాయని డీసీసీబీ, టీఎస్ కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు చెప్పారు.

- 8లో▸

గరిష్టం/కనిష్టం
$31^0/26^0$

వాతావరణం

జిల్లాలో ఉదయం నుంచి ఆకాశం మేఘావృతమై ఉంటుంది. ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుంది. సాయంత్రం ఆహ్లాదకరంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

శరవణ్‌కు స్విమ్మింగ్‌లో బంగారు పతకాలు



వరంగల్ స్పోర్ట్స్: హైదరాబాద్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రాహుల్ స్విమ్మింగ్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ నెల 16వ తేదీన నిర్వహించిన రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో హనుమకొండకు చెందిన కదలి ఉమ శరవణ్ పతకాలను సాధించి శెభాష్ అనిపించుకున్నాడు. అండర్–8 విభాగంలో బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీస్టైల్‌లో 2 బంగారు పతకాలు, బ్యాక్‌స్ట్రోక్ స్టైల్‌లో వెండి పతకం సాధించాడు. ఈసందర్భంగా శనివారం జిల్లా స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బాలసముద్రంలోని స్విమ్మింగ్ పూల్‌లో శరవణ్‌ను సత్కరించారు. ఇతను. డీఎస్‌ఏ కోచ్ రాయబారపు నవీన్ వద్ద శిక్షణ పొందుతున్నాడు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి స్వామిచరణ్, అధ్యక్షుడు ప్రవీణ్‌సింగ్ ఠాకూర్, చైర్మన్ సునీల్‌రెడ్డి పాల్గొన్నారు.

స్కానింగ్ సెంటర్ల తనిఖీ



ఎంజీఎం : జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారులు శనివారం హనుమకొండ జిల్లాలోని రెండు ఆస్పత్రుల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆస్పత్రికి వచ్చిన వారి వివరాలు, స్కానింగ్ నిర్వహించిన వారి పేర్లు, ఇంటిపేరు నమోదు చేస్తున్నారా లేదా? అనే కోణంలో పరిశీలించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ యాకుబ్‌పాషా, సీహెచ్ఓ మాధవరెడ్డి పాల్గొన్నారు.

పాలిసెట్ కౌన్సెలింగ్ ప్రారంభం



రామన్నపేట : పాలిటెక్నిక్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశం కోసం టీజీ పాలిసెట్–24 కౌన్సెలింగ్ ప్రక్రియ శనివారం నగరంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ప్రారంభమైనట్లు పాలిసెట్ కన్వీనర్ బైరి ప్రభాకర్ తెలిపారు. పాలిసెట్ ప్రవేశాల కోసం క్వాలిఫై అయిన విద్యార్థులు ఈ నెల 24వ తేదీ వరకు ధ్రువీకరణ సర్టిఫికెట్‌తో స్లాట్స్ ఎంచుకోవచ్చునని పేర్కొన్నారు. 25వ తేదీ వరకు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉదయం 6 నుంచి సాయంత్రం 9 గంటల వరకు సర్టిఫికెట్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థులు తాము కోరుకున్న కోర్సును టీజీపాలిసెట్.ఇన్ వెబ్‌సైట్ ద్వారా 27వ తేదీ వరకు ఎంచుకోవచ్చునని వివరించారు. ఆప్షన్స్ ఎంచుకున్న వారికి 30వ తేదీన సీటు కేటాయింపు జరుగుతుందన్నారు. 30నుంచి 4వ తేదీ వరకు ప్రవేశ రుసుం చెల్లించి సెల్ఫ్ రిపోర్ట్ చేయాలని సూచించారు.

పోలీస్ అధికారులకు పతకాలు

వరంగల్ క్రైం: విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వరంగల్ పోలీస్ కమిషనరేట్‌కు చెందిన పోలీస్ అధికారులకు రాష్ట్ర ప్రభుత్వం శనివారం సేవా పతకాలను ప్రకటించింది. హెడ్‌కానిస్టేబుల్ యాదగిరికి ఉత్తమ సేవా పతకం, ఇన్‌స్పెక్టర్ కె.శ్రీధర్‌రావు, హెడ్‌కానిస్టేబుళ్లు ఎండీ సాదిక్, ఎం.భిక్షపతి, కానిస్టేబుల్ శ్రీనివాస్ సేవా పతకాలకు ఎంపికయ్యారు.

ఎంపీ కావ్యను కలిసిన 'పద్మశ్రీ' సమ్మయ్య



హన్మకొండ చౌరస్తా: వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య, స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే శ్రీహరిని హనుమకొండలోని వారి నివాసంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత గడ్డం సమ్మయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం సమ్మయ్యను ఎంపీ, ఎమ్మెల్యేలు సన్మానించారు. సమ్మయ్య చిందు యక్షగానం జనగామకే కాదు, యావత్ తెలుగు ప్రజలకు గర్వకారణం అని కొనియాడారు.

పట్టాలకు చుట్టాలు!



కంటికి రెప్పలా రైలు పట్టాల కాపలా

- చాలీచాలనీ జీతాలు.. పని ప్రదేశంలో సౌకర్యాలకు కరువు
- ఇద్దరికి బదులు ఒకరితోనే ట్రాక్ పెట్రోలింగ్
- గ్యాంగ్‌మెన్లంటే ఇప్పటికీ చిన్న చూపే!

జీవితం

రెండు పట్టాలు వారికి రెండు కళ్లు. నిత్యం వాటి వెంటే పరుగులు. రైళ్లు నడిచేందుకు క్షేత్రస్థాయిలో వాళ్లే ముఖ్యులు. వాళ్లు పట్టాలకు చుట్టాలు. గ్యాంగోళ్లు అని పిలిచినా.. గ్యాంగ్ మెన్స్ అని సంబోధించినా వారి శ్రమ వర్ణించలేనిది. లక్షలాది మంది సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుతున్నారంటే వారి కృషి ఎనలేనిది. ఎండా, వాన, రాత్రీ పగలు తేడా లేకుండా చెమట చిందుస్తున్న శ్రామికుల జీవన చిత్రం 'సాక్షి' ప్రత్యేకం.

- కాజీపేట రూరల్

బ్రిటిష్ వారు 1857లో ఒక ప్రదేశం నుంచి మరో ప్రదేశానికి సరుకు రవాణా కోసం రైలు పట్టాలు వేశారు. రైల్వే వ్యవస్థకు బీజం పడిన సమయంలోనే గ్యాంగ్‌మెన్లు వచ్చారు. ఆ కాలంలో యంత్రాలు, మిషనరీ లేక కొందరు వ్యక్తులు సమూహంగా ఉండి రైలు పట్టాలను తీసుకెళ్లి రెండింటిని క్రమపద్ధతిలో అమర్చేవారు. ఇదంతా గ్యాంగ్‌తో చేసే పని అందుకే వీరికి గ్యాంగ్‌మెన్ అనే పేరొచ్చింది. కాజీపేట సబ్ డివిజన్ పరిధిలో సుమారు 5,000 మంది గ్యాంగ్‌మెన్లు పనిచేస్తున్నారు. వీరిలో దాదాపు 200 మంది వరకు గ్యాంగ్ ఉమెన్స్ ఉన్నారు.

విధులు ఇలా..

రైల్వే ఇంజనీరింగ్ విభాగానికి చెందిన నాల్గవ తరగతి ఉద్యోగులుగా గ్యాంగ్‌మెన్లు నిర్వహిస్తున్నారు. ఇంజనీరింగ్ విభాగంలో గ్యాంగ్‌మెన్లు, ట్రాలీ మెన్లు, గేట్‌మెన్లు, ఆర్టిజన్ కళాసీలు, ఆర్టిజన్లు ఉంటారు. వారంలో 5 రోజులు రోజుకు 12 గంటలు డ్యూటీ చేసిన వారికి ఆఫ్ రెస్ట్ 2 రోజులు ఉంటుంది. అయితే కొంత కాలం నుంచి 2 రోజులు రెస్ట్ ఇవ్వడం లేదని కార్మికులు అంటున్నారు. వాస్తవానికి వీరంతా గ్రేడ్ పే వారీగా విధులు నిర్వహించాలి. కానీ రూ.1800–1900ల గ్రేడ్‌పే ఉన్న వారు గ్యాంగ్‌లో ఉండి కీమెన్లుగా విధులు నిర్వహిస్తున్నారు. రూ.2400–2800లు గ్రేడ్‌పే ఉన్న వారు ట్రాలీ మెన్లుగా అధికారుల కనుసన్నలో విధులు నిర్వహిస్తున్నారు. ఇది విరుద్ధమైన విధులని గ్రేడ్ పేను బట్టి ఎవరి విధులు వారే నిర్వహించాలని గ్యాంగ్‌మెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ట్రాక్‌మెన్లపై వివక్ష



నేటి రైల్వే ట్రాక్‌మెన్లు బ్రిటిష్‌కాలం నాటి రూల్స్‌తో వివక్షను ఎదుర్కొంటున్నారు. ఇతర రైల్వే డిపార్ట్‌మెంట్లకంటే వీరి వేతనాలు తక్కువ. పదోన్నతులు, పని గంటలు, జీతభత్యాల విషయంలో తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఈ విషయాన్ని యాజమాన్యం గుర్తించాలి. లీవ్‌లు, మెడికల్ లీవ్‌లు మంజూరు చేయాలి.

- పి.రవీందర్, రైల్వే మజ్దూర్ యూనియన్ నాయకుడు

ప్రయాణికులకు రక్షణ



దేశసరిహద్దులో ఇండియన్ ఆర్మీ మాదిరి రైల్వే ట్రాక్‌మెన్లు రాత్రీపగలు రైలు పట్టాలను కంటికి రెప్పలా కాపాడుతుంటారు. లక్షలాది మంది ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేరవేస్తుంటారు. రైల్వే ట్రాక్‌మెన్ల రోస్టర్ మార్చాలి. రెండు విధానాల షిఫ్ట్‌లు పెట్టాలి. దీని వల్ల ట్రాక్ సేఫ్టీ మరింత పెరుగుతుంది.

- పి.దేవయ్య, రైల్వే ట్రాక్‌మెన్



ఇబ్బందులెన్నో..

ట్రాక్ పక్కన పాత్‌వే లేక గ్యాంగ్‌మెన్లు, గ్యాంగ్ ఉమెన్లు ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉంది. రాత్రి పూట ట్రాక్ పెట్రోలింగ్ చేసే ట్రాక్ మెన్ 7 కిలో మీటర్ల దూరం వరకు ట్రాక్ తనిఖీ చేసుకుంటూ వెళ్లి తిరిగి అక్కడి నుంచి మళ్లీ.. ట్రాక్ తనిఖీ చేసుకుంటూ రావాలి. ఈసమయంలో పట్టాలపై నీరు చేరినా, ట్రాక్ వెల్డింగ్ ఊడిపోయినా, పట్టా విరిగినా, పట్టాల మధ్య రాళ్లు పెట్టి ఉన్నా.. ట్రాక్ పైకి నీళ్లు చేరినా ఈవిషయాల్ని వెంటనే దగ్గర్లోని రైల్వే స్టేషన్ అధికారులకు తెలియజేయాలి. ట్రాక్ పెట్రోలింగ్‌లో ఒక్కరే విధులు నిర్వర్తిస్తున్నప్పుడు అనారోగ్యం బారిన పడినా.. దుండగులు దాడి చేసినా.. జంతువులు దాడి చేసినా దిక్కు లేదు. ఇద్దరు ఉంటే సేఫ్టీ ఉంటుందని గ్యాంగ్‌మెన్లు, ఉమెన్లు కోరుతున్నారు.

ఇప్పటికీ చిన్నచూపే..

రైల్వేలో గ్యాంగ్‌మెన్లంటే ఇప్పటికీ చిన్నచూపే. కొన్ని సెక్షన్లలో ఇప్పటికీ గ్యాంగ్‌మెన్లు ఆఫీస్ కార్యాలయాలకు దూరంగా నిలబడాలి. పీడబ్ల్యూఐ అధికారులకు దండం పెట్టాలి. వారి హక్కులు వారు అడగలేని పరిస్థితి. వీరి సమస్యలను పెద్దగా రైల్వే అధికారులు కానీ నాయకులు కానీ పట్టించుకోరని గ్యాంగ్‌మెన్లు వాపోతున్నారు. ప్రస్తుతం యువ గ్యాంగ్‌మెన్లు, ట్రాక్‌మెన్లు, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ చేసి ఆర్‌ఆర్‌బీ ద్వారా, లార్సెస్ పథకం ద్వారా జాయిన్ అయినవారూ వీరిలో ఉన్నారు. కాగా.. జీతాలు పెంచాలని, తమకు పని ప్రదేశాల్లో సౌకర్యాలు, సదుపాయాలు కల్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రక్షక్ డివైస్ పరికరం ఇవ్వాలని, కీమెన్‌ల కిట్టులో బరువు తగ్గించాలి, బీట్ లెంత్ తగ్గించాలని వారు కోరుతున్నారు.

వసతులు నిల్..

గ్యాంగ్‌మెన్ల కుటుంబాలకు రైల్వే క్వార్టర్స్ వసతి కల్పిస్తే.. ట్రాక్‌కు దగ్గరగా ఉంటారు. రైలు పట్టాలకు ఏమైనా ప్రమాదం, రిపేర్లు అయినప్పుడు త్వరగా వారు ఘటనాస్థలికి చేరుకునే అవకాశం ఉంటుంది. కానీ ప్రస్తుతం రైల్వే క్వార్టర్స్ నిర్వహణ సక్రమంగా లేక చాలా స్టేషన్లలో క్వార్టర్స్‌ను తొలగిస్తున్నారు. చాలా మంది గ్యాంగ్‌మెన్లు బయటే అద్దెకు ఉంటున్నారు. విధి నిర్వాహణలో కనీస వసతులు ఉండవు. గ్యాంగ్ ఉమెన్ల పరిస్థితి అయితే మరీ దారుణం. తాగడానికి మంచినీరు, వర్షం, ఎండ నుంచి కాపాడుకునేందుకు షెల్టర్లు, మరుగుదొడ్లు ఇవేవీ ఉండవు. ఇదివరకు ట్రాక్ పక్కన కొద్ది దూరంలో అక్కడక్కడా చెట్లు ఉండేవి. మూడో రైలు మార్గం కారణంగా ఆ చెట్లను కూడా తొలగించడంతో గ్యాంగ్‌మెన్లు, ఉమెన్లు ఎండకు ఎండుతూ, వానకు తడుస్తున్నారు.

కళ్లకు గంతలతో నిరసన

- మూడో రోజుకు చేరిన వైద్యవిద్యార్థుల ఆందోళన
- 24నుంచి ఓపీ విధుల బహిష్కరణ, సమ్మెబాట



కళ్లకు గంతలు కట్టుకుని తెలుపుతున్న జూనియర్ డాక్టర్లు

ఎంజీఎం : సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ నగరంలోని కాకతీయ మెడికల్ కళాశాలలో వైద్యవిద్యార్థులు చేపట్టిన ఆందోళన మూడో రోజుకు చేరుకుంది. శనివారం కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 24వ తేదీ నుంచి ఓపీ విధులు బహిష్కరించి సమ్మెబాట పట్టనున్నట్లు తెలిపారు. వైద్య విద్యార్థులకు సకాలంలో స్టైఫండ్లు విడుదల చేయాలని డిమాండ్‌చేశారు. కేఎంసీలో కళాశాలలో రోడ్ల నిర్మాణం, డాక్టర్ల కొత్త హాస్టల్స్ భవన నిర్మాణం చేపట్టాలని కోరారు. ఈ సమస్యలపై ప్రభుత్వానికి ఎన్నిమార్లు విన్నవించినా ఫలితం లేదన్నారు. సంబంధిత అధికారులనుంచి స్పందన రాకపోవడంతోనే నిరసన కార్యక్రమాలతోపాటు 24వ తేదీ నుంచి విధుల బహిష్కరణ చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జూనియర్ డాక్టర్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

పీజీ విద్యార్థినికి రోడ్డు ప్రమాదం..



కేఎంసీలో అంతర్గత రోడ్లు అధ్వానంగా మారడం వల్ల శనివారం డ్యూటీకి వెళ్తున్న ఓ పీజీ విద్యార్థిని కింద పడడంతో ఆమె కాలికి తీవ్ర గాయమైంది. వెంటనే వైద్యులు చికిత్స అందించారు. అంతర్గత రోడ్లు సరిగా లేకపోవడంతో ఎంతోమంది విద్యార్థులు ప్రమాదాల బారిన పడుతున్నా పట్టించుకోవడం లేదని జూడా ప్రతినిధులు తెలిపారు.

ప్రచారం.. వినూత్నం



బైక్‌కు ఫ్లెక్సీ పెట్టి వినూత్నంగా ప్రచారం నిర్వహిస్తున్న కళాశాల అధ్యాపకులు

శాయంపేట: ప్రైవేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్య అందజేస్తున్నామని శాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ అన్నారు. విద్యార్థులు తమ కళాశాలలో చేరాలని కోరుతూ.. ద్విచక్ర వాహనానికి ఫ్లెక్సీ కట్టి వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. కళాశాలలో కల్పిస్తున్న మౌలిక వసతులపై ముద్రించిన కరపత్రాలను శనివారం త్రైబజార్లో పంచిపెట్టారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ శ్రీధర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన, విద్యార్థుల్లో సేవా దృక్పథం పెంపొందించేందుకు ఎన్ఎస్ఎస్, స్పోకెన్ ఇంగ్లిష్, తదితర ఎన్నో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తల్లిదండ్రులు ప్రైవేట్ కళాశాలల మోజులో పడకుండా తమ పిల్లలను చేర్పించాలని కోరారు. ఇదే విషయమై ఎంపీడీఓని కలిసి ప్రభుత్వ కళాశాలలో విద్యార్థులు చేరేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో అధ్యాపకులు హిమబిందు, శైలేందర్, సునీల్‌కుమార్, వేణు, కల్పన, బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, విద్యార్థులు పాల్గొన్నారు.

రెండ్రోజులు తాగునీటి సరఫరా బంద్

వరంగల్ అర్బన్: దేశాయిపేట (ప్రతాపరుద్ర) ఫిల్టర్ బెడ్ పరిధిలో పైపులైన్ మరమ్మతుల కారణంగా.. వరంగల్‌లో సోమవారం, మంగళవారం తాగునీటి సరఫరా బంద్ ఉంటుందని బల్దియా ఈఈ శ్రీనివాస్‌రావు పేర్కొన్నారు. ఫిల్టర్ బెడ్ పరిధి ప్రాంతాలైన దేశాయిపేట, కొత్తవాడ, ఆటోనగర్, పోచమ్మ మైదాన్ ఎల్‌బీ నగర్, కాశిబుగ్గ, కంటి హాస్పిటల్, ఎంజీఎం ఆస్పత్రి ఏరియా, కేఎంసీ, మట్టెవాడ, వరంగల్ చౌరస్తా, బట్టల బజార్, సంతోషి మాతా కాలనీ ఏరియా, హంటర్ రోడ్, చార్ బౌళి, గోవింద రాజులగుట్ట, క్రిస్టియన్ కాలనీ, లేబర్ కాలనీ, ఎస్ఆర్ నగర్, ఏనుమాముల, ఆరేపల్లి, కొత్తపేట, గొర్రెకుంట, కీర్తినగర్, పైడిపల్లి, మొగిలిచెర్ల, ధర్మారం తదితర ప్రాంతాల్లో నీటి సరఫరా ఉండదన్నారు. ఆయా ప్రాంతాల ప్రజలు గమనించి అంతరాయానికి సహకరించాలని కోరారు.

పరిహారం ఇవ్వకుండానే పనులు..

- తప్పుల తడకగా 563 జాతీయ రహదారి భూసేకరణ
- నష్టపరిహారం కోసం పాట్లు
- భూములు లాక్కున్నారంటున్న బాధిత రైతులు



సారయ్య భూమిలో సాగుతున్న పనులు

హసన్‌పర్తి: జగిత్యాలనుంచి కోదాడ వరకు నిర్మిస్తున్న 563 జాతీయ రహదారి నిర్మాణ భూసేకరణలో అధికారుల తప్పిదాలు వెలుగు చూస్తున్నాయి. అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లకుండానే గూగుల్ మ్యాప్ ఆధారంగా సర్వే చేశారని రైతుల నుంచి ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. నష్టపరిహారం జాబితాలో అర్హులైన రైతుల పేర్లు లేకపోవడంపై వారు మండిపడుతున్నారు. భూమి సేకరించి రెండేళ్లు పూర్తయినా రైతులకు నష్టపరిహార ప్రక్రియ పూర్తికాకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. 563 జాతీయ రహదారి నిర్మాణంలో భాగంగా హసన్‌పర్తి మండలం అన్నాసాగరం నుంచి ముచ్చర్ల వరకు వందలాది ఎకరాల భూమి సేకరించారు.

భూసేకరణ చేయకుండానే...

- గొర్రె సారయ్యకు హసన్‌పర్తి శివారులోని సర్వే నంబర్ 63ఏలో సుమారు 0.33 ఎకరాల భూమి ఉంది. ఈభూమిని జాతీయ రహదారిలో కోల్పోతున్నాడు. పరిహారం జాబితాలో సారయ్య పేరును చేర్చలేదు. పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతున్నాయి. దీంతో పనులను సారయ్య కుటుంబసభ్యులు పలుమార్లు అడ్డుకున్నారు. అయినప్పటికీ పనులు మాత్రం ఆగడం లేదు.
- పెంబర్తి శివారులోని సర్వే నంబర్ 442/ఏ/బీ//ఏలో మల్లికాంబకు 0.20 ఎకరాల భూమి ఉంది. జాతీయ రహదారిలో మొత్తం భూమి సేకరించారు. కేవలం 0.14 ఎకరాలకు నష్టపరిహారం ఇచ్చారు. మిగిలిన 0.6 ఎకరాలకు పరిహారం ఇవ్వలేదని బాధితురాలు ఆవేదన వ్యక్తం చేసింది. అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదనే ఆవేదన వ్యక్తం చేసింది.
- మారపల్లి విజేందర్‌రెడ్డి అనే రైతుకు సంబంధించి హసన్‌పర్తి శివారులోని 585 సర్వే నంబర్‌లో 0.10ఎకరాల భూమి జాతీయ రహదారి కోసం సేకరించారు. రెండేళ్లుగా పరిహారం కోసం రెవెన్యూ డివిజన్ అధికారి చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నా పట్టించుకోని పరిస్థితి.

ప్రస్తుత మార్కెట్ ధర చెల్లించాలి



భూసేకరణ సమయంలో హసన్‌పర్తి పరిధిలో ఎకరానికి రూ.48లక్షలు ధర నిర్ణయించారు. ఇది 2019లో చేశారు. ప్రస్తుతం ఇక్కడ మార్కెట్ ధర ఎకరానికి రూ.1.08కోట్లు ఉంది. అప్పుడు భూసేకరణ చేయలేదన్నారు. కానీ పనులు చేస్తున్నారు. భూ సేకరణ చేసినట్లు సమాచారం కూడా ఇవ్వలేదు. ఇంతవరకు పరిహారం ఇవ్వలేదు. నా భూమి తీసుకుంటే ప్రస్తుతం ఉన్న మార్కెట్ ధర ఇవ్వాలి. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశా.

- గొర్రె సారయ్య, రైతు

రెండేళ్లుగా తిరుగుతున్నా



నష్టపరిహారం కోసం రెండేళ్లుగా తిరుగున్నా. తెలంగాణ పాస్ పుస్తకం ఉంది. ఎవరో నాపై ఫిర్యాదు చేశారని, నష్ట పరిహారం ఇవ్వమంటున్నారు. పట్టా భూమిని లాక్కుని పరిహారం ఇవ్వరా.

- మారపల్లి విజేందర్‌రెడ్డి, రైతు

గిరిజనుల సంక్షేమానికి కృషి

ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్





ఎంజీఎంలో వార్డును పరిశీలిస్తూ.., హనుమకొండ కలెక్టరేట్‌లో మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హన్మకొండ అర్బన్: దేశంలో గిరిజనుల సంక్షేమానికి జాతీయ స్థాయిలో ఎస్టీ కమిషన్ పని చేస్తోందని ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ అన్నారు. శనివారం హనుమకొండ కలెక్టరేట్‌లో వైద్య ఆరోగ్యం, గిరిజన హాస్టల్స్, తదితర అంశాలపై జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా కిషన్‌నాయక్ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యంపై ఉన్నతాధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ రాధికా గుప్తా, డీఎంహెచ్ఓ సాంబశివరావు, ఆర్డీఓ వెంకటేశ్, డీటీడీఓ ప్రేమకళ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో వైద్య సేవలపై ఆరా

ఎంజీఎం: ప్రభుత్వాస్పత్రుల్లో కల్పిస్తున్న వైద్యసేవలపై ప్రజల్లో విశ్వాసం కల్పించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్ కోరారు. శనివారం ఉదయం ఎంజీఎం ఆస్పత్రిని ఆయన సందర్శించారు. రోగులతో మాట్లాడి వైద్యసేవలపై ఆరా తీశారు. కార్డియాలజీ విభాగంలో ఉన్న రోగులకు రాత్రి భోజనం రాలేదని, రోగుల అటెండెంట్స్ వెళ్లి అడగ్గా.. 'మేం వార్డులో చెప్పాం, మీరే రాలేదు' అని నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చారని రోగులు, వారి బంధువులు హుస్సేన్‌నాయక్ ఎదుట వాపోయారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ.. ఆస్పత్రిలో 1,700 పడకలు ఉండగా.. 22 ఐసీయూ పడకలు మాత్రమే ఉండడంపై విచారం వ్యక్తం చేశారు. సమావేశంలో వరంగల్ కలెక్టర్ సత్య శారదాదేవి, కేఎంసీ ప్రిన్సిపాల్ డి.మోహన్‌దాస్, సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, వైద్యులు పాల్గొన్నారు.

కేయూ విద్యార్థుల పోరాటం మరువలేనిది: మంత్రి సీతక్క



కాళోజీ సెంటర్ : తెలంగాణ రాష్ట్రం కోసం కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులు చేసిన పోరాటం మరువలేనిదని మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. హనుమకొండలోని జెడ్పీ హాల్‌లో కేయూ గిరిజన ఉద్యోగ, విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌కు శనివారం రాత్రి సన్మానం చేశారు. కార్యక్రమానికి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ బలహీనవర్గాల అభివృద్ధి కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు రాజేందర్‌రెడ్డి, రాంచంద్రనాయక్, మురళీనాయక్ పాల్గొన్నారు.

చెత్తాచెదారం తొలగింపు



సాక్షి ఎఫెక్ట్

కాజీపేట: 'చెరువుకు చెర' శీర్షికన శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ పసునూరి భాస్కర్ ఆధ్వర్యంలో సిబ్బంది చెరువు కట్టపై ఉన్న చెత్తా చెదారాన్ని ట్రాక్టర్లలో వేసి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. 25 మంది పారిశుద్ధ్య సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం దాకా గ్యాంగ్ వర్క్ చేశారు. ఈసందర్భంగా ఎస్సై భాస్కర్ 'సాక్షి'తో మాట్లాడుతూ... ఇళ్ల నుంచి చెత్తను చెరువు కట్టపై వేస్తున్న వ్యక్తులను గుర్తించి నోటీసులు జారీ చేస్తామన్నారు.

క్లుప్తంగా

మహదేవపూర్ సీఐ బదిలీ

కాళేశ్వరం: మహదేవపూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి.రాజేశ్వర్‌రావు బదిలీ అయ్యారు. ఈ మేరకు మల్టీజోన్–1 ఐజీ ఏ.వి. రంగనాథ్.. రాజేశ్వర్ రావును ఐజీ ఆఫీస్‌కు అటాచ్ చేస్తూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. రాజేశ్వర్‌రావు ఏడు నెలల క్రితం మహదేవపూర్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. కాగా, ఏప్రిల్ 15న మహదేవపూర్ పీఎస్‌లో జెడ్పీటీసీ భర్త డ్యాన్స్ చేసిన వీడియో వైరల్ కావడంతో అప్పటి ఎస్సై, కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. మూడు రోజుల క్రితం కాళేశ్వరం ఎస్సై తన పీఎస్‌లోని ఓ మహిళా హెడ్‌కానిస్టేబుల్‌పై లైంగిక దాడికి పాల్పడిన ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనంగా మారింది. దీంతో ఎస్సైని సర్వీస్ నుంచి తొలగించారు. ఈ రెండు ఘటనలు సర్కిల్ పరిధిలో శాంతిభద్రతలపై ప్రభావం చూపుతాయనే నేపథ్యంలో సీఐపై బదిలీ వేటు వేసినట్లు తెలిసింది.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి


విజేతలతో అతిథులు

హన్మకొండ : విద్యార్థులు బాగా చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని హనుమకొండ ఇన్స్పెక్టర్ వై.సతీష్, ఆర్టీసీ వరంగల్ రీజియన్ డిప్యూటీ ఆర్‌ఎం మాధవ రావు అన్నారు. 'లక్షే లక్ష్యం–టీజీఎస్ ఆర్టీసీ ఉద్యోగుల కర్తవ్యం' అనే అంశంపై ఆర్టీసీ ఉద్యోగుల పిల్లలకు శనివారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. హనుమకొండలోని ఆర్టీసీ వరంగల్–1 డిపోలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు, అలాగే పది, ఇంటర్, జేఈఈలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసపత్రాలు, బహుమతులు అందించి సన్మానించారు. ఈ సందర్భంగా సతీష్, మాధవరావు మాట్లాడుతూ లక్షే లక్ష్యం సాధించి వరంగల్–1 డిపోను లాభాల బాటలో నడిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ వంగల మోహన్ రావు, అసిస్టెంట్ ఇంజనీర్ (మెకానికల్) టి.శ్రీనివాసులు, అసిస్టెంట్ మేనేజర్ (ట్రాఫిక్) సీ.హెచ్ సంతోష్ కుమార్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

రెడ్డి చికెన్ సెంటర్
కిషన్‌పుర, హన్మకొండ
హోల్‌సేల్ రేటు
బ్రాయిలర్ చికెన్ రేటు
స్కిన్‌లెస్ చికెన్ రేటు
Cell: 9989299661

ప్రమాదం.. పసిగట్టొచ్చు

పిడుగులు, వర్షం సమాచారం ముందే తెలుసుకోవచ్చు
- వాతావరణ పరిస్థితులపై ఎప్పటికప్పుడు సమాచారం
- పలు యాప్‌లను తీసుకొచ్చిన కేంద్రం


భూపాలపల్లి అర్బన్: ఇక నుంచి ప్రకృతి ప్రమాదం పసిగట్టొచ్చు. పిడుగు, వర్షాలు, ఈదురుగాలుల లాంటి వైపరీత్యాలను ముందే తెలుసుకోవచ్చు. ఇవి ఎప్పుడు? ఎక్కడ పడతాయో.. తెలియని పరిస్థితి. వీటివల్ల మనుషులు, మూగజీవాలు మృత్యువాత పడిన ఘటనలు అనేకం. గతేడాది చిట్యాల మండలం కైలాపూర్ సమీపంలో మిరప తోటలో పని చేస్తుండగా ఇద్దరు మహిళలపై పిడుగు పడగా వారు అక్కడికక్కడే మృతి చెందారు. అలాగే, ఈ ఏడాది మే, జూన్ మాసాల్లో ఉరుములతో కూడిన పిడుగులు పడి పలు మండలాల్లో రైతులు చనిపోగా మూగజీవాలు మృత్యువాత పడ్డాయి. ఇలాంటి ఘటనలు నిత్యం ఏదో చోట కోకొల్లలుగా చోటుచేసుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో అన్నదాతలకు అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం భారత వాతావరణ శాఖ ద్వారా పలు యాప్‌లు తీసుకువచ్చింది. ఇంటర్ నెట్ ద్వారా వాటిని డౌన్‌లోడ్ చేసుకుంటే పిడుగు, వర్షం ఎప్పుడు పడుతుందో ఇట్టే తెలిసిపోతుంది. తదనుగుణంగా రైతన్న వ్యవహరిస్తే చాలు.. యాప్‌లతో మరో ఐదు రోజుల వరకు వాతావరణ పరిస్థితులు ఎలా ఉంటాయో తెలుసుకునే వీలు కల్పించింది.

రెయిన్ అలారం..



గూగుల్ ప్లే స్టోర్ నుంచి రెయిన్ అలారం అని ఇంగ్లిష్‌లో టైప్ చేస్తే ఈ యాప్ కనిపిస్తుంది. కేవలం ఒక నిమిషంలో డౌన్‌లోడ్ అవుతుంది. వినియోగదారుడు అందించిన వివరాల మేరకు అతను ఉన్న ప్రాంతానికి సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో ఎక్కడ వర్షం పడే సూచనలున్నాయో సమగ్ర సమాచారం క్షణాల మీద అందిస్తుంది. దీంతో వర్షం ముప్పు తెలుసుకొని, ముందే జాగ్రత్తపడే అవకాశం ఉంటుంది.

దామినీ యాప్..



సాధారణంగా వర్షాకాలం తోపాటు ఏప్రిల్, మే నెలల్లో పిడుగులు పడడం సహజం. వ్యవసాయ పనుల హడావుడిలో ఉండే రైతులు పిడుగు పడే సమయంలో దగ్గరలోని ఎత్తయిన చెట్ల కిందకో, మరోచోటుకో వెళ్తుంటారు. అవి అంత సురక్షితం కాదని నిపుణులు చెబుతున్నారు. ఇలాంటి సందర్భాల్లో రైతులను అప్రమత్తం చేసేదే 'దామినీ' యాప్. దీనిని కూడా గూగుల్ ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలి. ఇది సమీపంలోని 20 కిలోమీటర్ల దూరంలో 5 నుంచి 20 నిమిషాల్లో ఎక్కడ పిడుగు పడుతుందో అప్రమత్తం చేస్తుంది. దీనివల్ల సురక్షిత ప్రాంతాలకు వెళ్లొచ్చు.

విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి..

ప్లే స్టోర్ నుంచి మూడు యాప్‌లను విడివిడిగా డౌన్‌లోడ్ చేసుకోవాలి. ప్రతీ యాప్‌నకు వినియోగదారుడి వివరాలు ఇవ్వాల్సి ఉంటుంది. అప్పుడే సరైన సమాచారాన్ని సకాలంలో అందిస్తాయి.

మేఘదూత్ యాప్..



పంట చేలకు ఎరువులు అందించాల్సిన సమయంలో లేదా వరి కోతల సందర్భంలో రైతులకు నష్టం చేసేవి వర్షాలే. దీనిని తప్పించేందుకు భారత వాతావరణ శాఖ మేఘదూత్ యాప్‌నకు రూపకల్పన చేసింది. గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుంటే తాజా సమాచారం అందిస్తుంది. రాబోయే 5 రోజుల్లో వాతావరణ మార్పులు, వర్ష సూచనలు సహా ఆకాశం మేఘావృతమవుతుందా లేదా గాలులు ఏ మేరకు ఎక్కడి నుంచి ఎక్కడకు ఏ దిశగా వీస్తాయో తెలుపుతుంది.

గంజాయి మహమ్మారి నిర్మూలనకు చర్యలు

- రాష్ట్ర మంత్రి సీతక్క



సాక్షి, మహబూబాబాద్ : గంజాయికి బానిసై కొందరు మృగాళ్లు తయారవుతున్నారని, ఈ మహమ్మారిని రాష్ట్రంలో పూర్తిగా నిర్మూలించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని పోలీస్‌శాఖను ఆదేశించినట్లు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శనివారం మహబూబాబాద్ కలెక్టర్ కార్యాలయంలో జిల్లా అభివృద్ధిపై ఆమె సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడారు. గంజాయి రవాణాతోపాటు, రాష్ట్రంలో విక్రయాలు జరగకుండా చూడాలన్నారు. గత ప్రభుత్వం హయాంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ భూములు అన్యాక్రాంతమయ్యాయన్నారు. భూములు ఆక్రమించుకున్న వారిలో ఎంత పెద్దవారున్నా సహించేది లేదన్నారు. డాక్టర్ కావాలని ఎంతో ఆశతో కష్టపడి చదివిన పిల్లల భవిష్యత్‌తో కేంద్ర ప్రభుత్వం ఆటలాడుకుంటుందని చెప్పారు. నీట్ పేపర్ లీకేజీ చేసి వారికి అనుకూలమైన ఇచ్చారని ఆరోపించారు. పేపర్ లీకేజీపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరపాలని, మరోసారి ఇలాంటి సంఘటనలు జరగకుండా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్, ప్రభుత్వ విప్ రాంచంద్రు నాయక్, ఎమ్మెల్యే మురళీ నాయక్ ఉన్నారు.

రూ.529.44 కోట్ల రుణాల మాఫీ

- వరంగల్ డీసీసీబీ చైర్మన్ రవీందర్ రావు

హన్మకొండ: వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ద్వారా రైతులకు ఇచ్చిన పంట రుణాలు రూ.529.44 కోట్లు మాఫీ కానున్నాయని డీసీసీబీ, టీఎస్ కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు చెప్పారు. శనివారం హనుమకొండలోని వరంగల్ డీసీసీబీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉమ్మడి వరంగల్ జిల్లా పరిధిలో 78,432 మంది రైతుల పంట రుణాలు రూ.529.44 కోట్ల రుణమాఫీ ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపామని వివరించారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.2 లక్షల రుణమాఫీని ఒకే విడతలో చేయాలని చారిత్రాత్మక నిర్ణయం తీసుకుందన్నారు. దేశంలో ఏ ప్రభుత్వం ఇలాంటి నిర్ణయం తీసుకోలేదని, రూ.2 లక్షల రుణమాఫీ చేయలేదన్నారు. తెలంగాణలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రివర్గం తీసుకున్న గొప్ప నిర్ణయమన్నారు. దీంతో


మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ రవీందర్‌రావు

రైతులకు రూ.2 లక్షల వరకు లబ్ధి చేకూరనుందన్నారు. మాఫీ చేసిన రైతులకు తిరిగి రుణాలు ఇవ్వనున్నట్లు చెప్పారు. ఆగస్టు 15లోపు రుణమాఫీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. అనంతరం డీసీసీబీ కార్యాలయ ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఎండీ వజీర్ సుల్తాన్, జీఎం శ్రీధర్, డైరెక్టర్లు కక్కెరాల హరిప్రసాద్, చెట్టుపల్లి మురళీధర్, యొలుగం రవితేజ, చాపల యాదగిరి రెడ్డి, సంపల్లి నర్సింగరావు, ఎన్నమనేని జగన్ మోహన్ రావు, కె.నరేందర్ పాల్గొన్నారు.

కొడుకు కళ్లెదుటే.. ప్రాణం పోయింది

- విద్యుదాఘాతంతో తండ్రి మృతి
- రాజులకొత్తపల్లిలో ఘటన


వెంకన్న మృతదేహం

నెల్లికుదురు : కొడుకు కళ్లెదుటే.. తండ్రి ప్రాణం పోయింది. తండ్రి విద్యుదాఘాతానికి గురికాగా కొడుకు కాపాడే ప్రయత్నం చేసినా ఫలితం లేకుండా పోయింది. మాయదారి మృత్యువు అప్పటికే బలితీసుకుంది. ఈ విషాదకర ఘటన మండలంలోని రాజులకొత్తపల్లిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన లింగాల వెంకన్న (49) తనకున్న భూమితోపాటు మరో రెండు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నాడు. శనివారం వ్యవసాయ భూమి వద్ద నారు మడి సాగు నిమిత్తం విద్యుత్ బోరు మోటార్ బిగించేందుకు రెండో కుమారుడు ఉపేందర్‌తో కలసి మరమ్మతులు చేస్తున్నాడు. కొడుకు మోటార్ వద్ద ఉండగా వెంకన్న తీగలు సరి చేసుకుంటు వస్తున్నాడు. ఈ క్రమంలో అతుకులు పడిన సర్వీస్ వైరును చూసుకోకుండా మరమ్మతులు చేస్తుండగా విద్యుత్ సరఫరా అయి షాక్‌కు గురై పడిపోయాడు. గమనించిన ఉపేందర్ విద్యుత్ తీగలను తొలగించి వచ్చి చూసేవరకు అప్పటికే వెంకన్న మృతి చెందాడు. తండ్రి తన కళ్లెదుటే ప్రాణం కోల్పోతుంటే కాపాడుకోలేక పోయానని ఉపేందర్ గుండెలవిసేలా రోదించారు. వెంకన్న మృతితో ఆయన కుటుంబంతోపాటు రాజులకొత్తపల్లిలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మృతుడికి భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు.


రామకిష్టాపూర్(టీ)లో మహిళ..


వెంకటలక్ష్మి(ఫైల్)

టేకుమట్ల: విద్యుత్ ఘాతంతో ఓ మహిళ మృతి చెందగా, మరో మహిళ తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతోంది. ఈ ఘటన శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండలం రామకిష్టాపూర్(టీ)లో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెద్దపల్లి జిల్లా గోదావరిఖని 8ఇంక్లైన్ సంతోష్‌నగర్‌కు చెందిన గాజుల వెంకటలక్ష్మి(48) తన భర్త భిక్షపతితో కలిసి కూతురు భవానీని చూసేందుకు శుక్రవారం రామకిష్టాపూర్(టీ)కు వచ్చింది. రాత్రి కురిసిన వర్షానికి డోర్ పరదా పూర్తిగా తడవడంతో దానిని తీసి దండెంపై ఆరవేస్తున్న క్రమంలో విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన ఆమె వియ్యంకురాలు బూర నిర్మల.. వెంకటలక్ష్మిని కాపాడే ప్రయత్నం చేయడంతో ఆమె కూడా విద్యుదాఘాతానికి గురైంది. గమనించిన కుటుంబీకులు విద్యుత్ మేన్ ఆఫ్ చేసి అపస్మారక స్థితికి చేరుకున్న ఇద్దరిని 108లో చిట్యాల సివిల్ ఆసుపత్రికి తరలించారు. కాగా, అప్పటికే వెంకటలక్ష్మి మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. నిర్మల చికిత్స పొందుతున్నట్లు తెలిపారు. ఈ ఘటనపై మృతురాలి కూతురు భవానీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై కుమారస్వామి తెలిపారు.

ఒలింపిక్స్‌లో గెలుపే లక్ష్యం..

- జాతీయ స్థాయిలో రాణిస్తున్న క్రీడాకారులు
- నేడు ఇంటర్నేషనల్ ఒలింపిక్స్ డే



వరంగల్ స్పోర్ట్స్ : పట్టుదల, క్రమశిక్షణ, నిత్యసాధనతో లక్ష్యాన్ని చేరుకోవచ్చు. గురువుల సూచనలతో జాతీయ స్థాయిలో పతకాలను సాధిస్తూ అనుకున్న లక్ష్యానికి చేరువలో ఉన్నారు. ఇప్పటికే అనేక జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొన్న జిల్లా క్రీడాకారులు ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని దేశానికి వన్నె తెచ్చేలా పతకాలను సాధించడమే ఏకైక లక్ష్యమంటున్నారు. వచ్చే నెల నుంచి ఆగస్టు 11వ తేదీ వరకు పారిస్‌లో నిర్వహించనున్న ఒలింపిక్స్ క్రీడల్లో పాల్గొనేందుకు భారత క్రీడాకారులు సమాయత్తం అవుతున్నారు. నేడు ఇంటర్నేషనల్ ఒలింపిక్స్‌డేను పురస్కరించుకుని పలువురు జిల్లా క్రీడాకారుల అభిప్రాయాలు 'సాక్షి' పాఠకుల కోసం.

కోచ్ వద్ద నిత్య సాధన



మా నాన్న స్ఫూర్తితో జాతీయ స్థాయి స్విమ్మింగ్ పోటీల్లో పాల్గొని పతకాలు తీసుకొచ్చా. ఫ్రీస్టైల్, బ్యాక్ స్ట్రోక్, బటర్ ఫ్లై, బ్రెస్ట్ స్ట్రోక్ ఈవెంట్లలో కోచ్ నవీన్ వద్ద నిత్యం సాధన చేస్తున్నా. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని పతకాలు సాధించాలన్నదే లక్ష్యం.

– కట్ల ధీరజ్, స్విమ్మర్, హనుమకొండ

పీవీ సింధు స్ఫూర్తితోనే..



చిన్నప్పటి నుంచి హనుమకొండ జేఎన్ ఇండోర్ స్టేడియంలో కోచ్ రమేశ్ వద్ద శిక్షణ పొందా. ప్రస్తుతం హైదరాబాద్‌లోని పుల్లెల గోపిచంద్ అకాడమీలో శిక్షణ తీసుకుంటున్నా. పీవీ సింధు స్ఫూర్తితో బ్యాడ్మింటన్‌లో రాణిస్తున్నా. ఎప్పటికైనా ఒలింపిక్స్‌లో పాల్గొని సత్తా చాటాలన్నదే ఏకైక లక్ష్యం.

– ఎం కీర్తి, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, హనుమకొండ

బంగారు పతకమే లక్ష్యం


మెడల్స్‌తో జీవంజి దీప్తి

పర్వతగిరి : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం కల్లెడ గ్రామానికి చెందిన జీవంజి దీప్తి అంతర్జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో రాణిస్తోంది. పేదరికంలో పుట్టిన జీవన్‌జీ దీప్తి తండ్రి యాదగిరి, తల్లి ధనలక్ష్మి గ్రామంలో వ్యవసాయ కూలీలుగా పని చేస్తుంటారు.కాగా దీప్తి ఇంటలిజెన్స్ కోషియంట్ (ఐక్యూ) సమస్యతో బాధపడేది. దీప్తి కల్లెడ ఆర్డీఎఫ్ పాఠశాలలో గణతంత్ర దినోత్సవ సందర్భంగా జరిగిన పోటీల్లో ప్రతిభ చాటింది. అప్పటి నుంచి వెనుతిరగకుండా జిల్లా, రాష్ట్ర, జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో పతకాలను సొంతం చేసుకుంది. కాగా, తన ప్రతిభను గుర్తించిన వ్యాయామ ఉపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, అథ్లెటిక్ కోచ్ నాగపూరి రమేశ్ అందుకు సహకరించిన ఎర్రబెల్లి రాంమోహన్‌రావుకు రుణపడి ఉంటానని, అలాగే దేశం తరఫున ఒలింపిక్‌లో పాల్గొని బంగారు పతకం సాధించాలనేదే ఆమె లక్ష్యంగా తెలిపింది.

స్పోర్ట్స్ కోటాలో ఉద్యోగమే లక్ష్యం



చిన్నప్పటి నుంచి సాఫ్ట్‌బాల్ అంటే చాలా ఇష్టం. స్కూల్ సమయంలో సాధన చేయలేకపోయాను. ఇంటర్మీడియట్ నుంచి సాఫ్ట్‌బాల్‌లో పూర్తిస్థాయి శిక్షణ ప్రారంభించాను. 2018 నుంచి ఇప్పటి వరకు అనేక రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించాను. జపాన్‌లో జరిగే ఏషియన్ గేమ్స్‌లో పాల్గొనే భారత్ జట్టుకు సైతం అర్హత సాధించాను. ఎప్పటికైనా స్పోర్ట్స్ కోటాలో గ్రూప్–1 ఉద్యోగం సాధించడమే లక్ష్యం.

– గారంపెల్లి వికాసిని, పరకాల, సాఫ్ట్‌బాల్

ఒలింపిక్స్‌లో ఆడాలి



రాష్ట్ర స్థాయిలో ఆరు సార్లు చాంపియన్‌గా నిలిచి బంగారు పతకాలు సాధించడం మరిచిపోలేను. కేరళలో గతేడాది నిర్వహించిన ఉమెన్స్ సౌత్ జోన్‌లో సిల్వర్ మెడల్ సాధించా. కోచ్ నాగరాజు ఎప్పటికప్పుడు కొత్త మెళకువలు నేర్పిస్తూ, కఠోరా శిక్షణ ఇస్తున్నాడు. 2036లో భారతదేశంలో జరిగే ఒలింపిక్స్‌లో పాల్గొనడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా.

– ఇ.అక్షిత, జూడో క్రీడాకారిణి

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

ఇల్లు అమ్మబడును
■ ములుగు రోడ్డు KSR గార్డెన్స్ ఆర్చి మేన్ రోడ్ 2nd బిట్ 300 గజాల స్థలంలో గల G+1 ఇండిపెండెంట్ ఇల్లు అమ్మకమునకు కలదు. సెల్: 9849211515, 7013069889. [W-1242488]

PLOT FOR SALE
■ మామునూర్‌లో కుడా లే అవుట్ రెండు దిశల చౌరస్తా నుండి మరియు జ్యోతి భాపులె ఆశ్రమ పాఠశాల పక్క నుండి 800 మీటర్ల దూరంలో పెన్షన్‌పూరా దాంబర్ రోడ్డుపై సౌత్ ఫేసింగ్ 263 అమ్మకానికి. 9032111600. [W-1242415]

■ About 250 Sq. Yards to 500 Sq. Yards Residential Plot For Sale. Near NIT, Beside Bishop Beretta School, FatimaNagar. Contact: Jayaraju: 9989635057, Praveen: 8008422520 [HA-13673]

LEASE / RENT
■ HNK, అదాలత్ నుండి K.L.N. రోడ్‌కు వెళ్ళే మెయిన్ రోడ్ (S.V. కాలనీ) రోడ్ నెం.5, 1,2,3 అంతస్తుల భవనం 1650 Sft. కిరాయికి / లీజుకి ఇవ్వబడును. (న్యూ బిల్డింగ్) 95028 79612. [M-11688]

SERVICES
■ వ్యక్తిగత, వ్యవసాయ, వ్యాపార, ప్రాపర్టీ కొరకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇప్పించబడును. CIBIL అవసరం లేదు. NPA కుడా, దరఖాస్తు హన్మకొండ. సెల్: 8096520976. [WA-6502]

స్టార్ హోం కేర్ సర్వీస్
■ స్టార్ హోంకేర్ వంట, ఇంటి పని చేయుటకు వృద్ధులను, పేషెంట్స్‌ను, చిన్న పిల్లలను 12 గం॥ 24 గం॥లు చూసుకొనుటకు మీ ఇంటికే కేర్ టేకర్స్ పంపించబడును. 8186926067, 8977263124. [W-1242420]

హోమియో క్లినిక్
■ డా॥బి. పవన్‌కుమార్, సీనియర్ హోమియో ఫిజీషియన్, 38 సం॥ల అనుభవ వైద్యులు. శ్రీ సాయి హోమియో క్లినిక్, విజయటాకీస్ రోడ్డు, హన్మకొండ. అన్ని రకాల వ్యాధులకు శాశ్వత పరిష్కారం కొరకు సంప్రదించండి. ఫోన్.8096523532. [W-1242411]

HEALTH CARE
■ ఆత్మీయ రిహాబ్ సెంటర్ యందు వృద్ధులకు మరియు పక్షవాతం, సర్జరీ తరువాత రికవరీ కోసం క్యాన్సర్ పేషెంట్స్ కొరకు అవసరమగు 24 గం॥ల సేవలు అందించబడును. ✆ 62814 76205, 94408 25526 [M-11669]

4 లైన్ల క్లాసిఫైడ్ ప్రకటన 260/- రూ॥ అదనపు లైను 60/- రూ॥ మాత్రమే 5% GST అదనము

BUSINESS OFFER
■ ICF కార్పొరేషన్ అగ్రికల్చర్, బిజినెస్ పర్సనల్, ఎడ్యుకేషన్, ప్రాపర్టీ పైన అమౌంట్ ఇవ్వబడును. ఏజెంట్స్ & DMA కావలెను. జీతం+కమీషన్ సంప్ర: 7988242391. [H-189668]

WANTED
■ Off. Executive/ Accountant (0-2 Yr. Exp. Related Mfg. Sal:8K-12K) Prod. Executive: Food/ Nutrition dip. Holder (Sal:10K-15K) Mark/Sales: Executives, Cold pressed organic/Natural Oils and Foods/ Grocery Products Related, Exp:0-2Yr, (Sal:8K-20K). Resumes Send to Mail: veghannaturals@gmail.com or W.up to: 9919911016. [WA-6501]

■ Wanted Technicians 10th, ITI (P/F) at Rampur Industrial Area, Kazipet, Age: 18 to 40 yrs (10K/M) Cont: 7981016232. [WA-5959]

WANTED TEACHERS
■ Wanted Hindi Teacher for 1 to 6 classes, Physics teacher for 7th to 10th Indian Kids High School, SVN Road, WGL. Cell: 9963006221. [W-1242489]

■ Wanted incharge/principal with fluency in English, Computer teacher for primary and pre primary teachers. Masster High School, Fort Warangal. 8790720106 [W-1242490]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకై సంప్రదించండి
హన్మకొండ : 9010144453
వరంగల్ : 9705748198
నర్సంపేట : 9553955722
జనగామ : 9951602871
మహబూబాబాద్ : 9010144453
పరకాల : 9010299096
జయశంకర్ భూపాలపల్లి : 9705748198

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

- జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు హుస్సేన్ నాయక్


మాట్లాడుతున్న హుస్సేన్ నాయక్

హన్మకొండ: ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్.. టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డిని ఆదేశించారు. శనివారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయంలో విద్యుత్ ఎస్టీ ఉద్యోగులతో హుస్సేన్ నాయక్ సమావేశమయ్యారు. ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలు స్వీకరించారు. సమస్యలు పరిష్కరించాలని సీఎండీకి సూచించగా స్పందించిన ఆయన పరిశీలించి నిర్ణయం తీసుకుంటానన్నారు. ఈ సందర్భంగా హుస్సేన్ నాయక్ మాట్లాడుతూ ఎస్టీలకు అన్యాయం జరిగితే కమిషన్ సహించదన్నారు. కమిషన్‌కు విస్తృత పరిధి ఉందన్నారు. తప్పు చేసిన వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. గత సీఎండీ హయాంలో ఎన్పీడీసీఎల్‌లో ఎస్టీ విద్యుత్ ఉద్యోగులకు ఇబ్బందులు కలిగించారన్నారు. అకారణంగా, చిన్న పొరపాట్లకు పెద్దఎత్తున చర్యలు తీసుకున్నారని, ఆర్థిక నష్టం కలిగించారన్నారు. వీటన్నింటిని యాజమాన్యం సమీక్షించి న్యాయం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జి డైరెక్టర్లు సదర్‌లాల్, అశోక్ కుమార్, వి.మోహన్ రావు, ఎస్టీ విద్యుత్ ఉద్యోగుల సంక్షేమ సంఘం ఎన్పీడీసీఎల్ కంపెనీ అధ్యక్షుడు వాలు నాయక్, ప్రధాన కార్యదర్శి అజ్మీరా శ్రీరాం నాయక్ పాల్గొన్నారు.

పోలీస్ కార్యాలయంలో ఎస్టీ కేసులపై సమీక్ష


వరంగల్‌క్రైం : వరంగల్ పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోత్ హుస్సేన్ నాయక్ శనివారం ఎస్టీ కేసులపై సమీక్ష జరిపారు. ముందుగా హుస్సేన్ నాయక్‌కు పరిపాలన విభాగం అదనపు డీసీపీ రవి స్వాగతం పలికారు. అనంతరం హుస్సేన్‌నాయక్.. సమీక్ష చేశారు. కమిషనరేట్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ఎస్టీ కేసుల వివరాలతోపాటు, బాధితులకు అందజేయాల్సిన నష్టపరిహారం వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించడంతోపాటు బాధితులకు సత్వరమే నష్టపరిహారాన్ని అందజేయాలని సూచించారు.

సర్వీస్ నుంచి స్వామి రిమూవ్

- ఉత్తర్వులు జారీ చేసిన టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ

హన్మకొండ: అవినీతికి పాల్పడిన విద్యుత్ అధికారి రేగుంట స్వామిని ఉద్యోగం నుంచి తొలగిస్తూ టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. టీజీ ఎన్పీడీసీఎల్ ఆదిలాబాద్ రూరల్ సబ్ డివిజన్‌లో అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ (ఆపరేషన్)గా రేగుంట స్వామి పని చేస్తున్న సమయంలో ఇచ్చోడ మండలం సిరిచెల్మకు చెందిన గుండాల కన్నమయ్య మరికొంతమంది రైతులతో కలిసి తత్కాల్ స్కీమ్‌లో భాగంగా 2010 జనవరి 12న వ్యవసాయ సర్వీస్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఆ దరఖాస్తు స్థానిక అధికారుల నుంచి అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్(ఏడీఈ) రేగుంట స్వామికి చేరింది. రైతులు ఏడీఈని కలవగా ఆయన రూ.30 వేలు డిమాండ్ చేశాడు. తాము అంత మొత్తం ఇవ్వలేమని చెప్పడంతో రూ.15 వేలు ఇవ్వాలని డిమాండ్ చేయగా, అవినీతి నిరోధక శాఖను సంప్రదించారు. దీంతో 2010 నవంబర్ 1న రైతుల నుంచి రూ.15 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేశారు. ప్రాసిక్యూషన్ తరఫున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన ఏసీబీ కోర్టు న్యాయమూర్తి.. రేగుంట స్వామికి ఏడేళ్ల జైలు శిక్ష, రూ.30 వేల జరిమానా విధిస్తూ 2024 ఏప్రిల్, 10న తీర్పు ఇచ్చారు. శిక్ష పడిన రేగుంట స్వామిని సర్వీస్ నుంచి తొలగిస్తూ ఈ నెల 22 (గురువారం)న సీఎండీ కర్నాటి వరుణ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

పురోహితుడి ఆత్మహత్య


కృష్ణామాచారి (ఫైల్)

భూపాలపల్లి అర్బన్: ఉరివేసుకుని ఓ పురోహితుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన శనివారం భూపాలపల్లిలో చోటు చేసుకుంది. ఎస్సై సుధాకర్ కథనం ప్రకారం .. పట్టణంలోని సుభాష్‌కాలనీకి చెందిన కొండపర్తి కృష్ణామాచారి(24) పురోహితం చేస్తూ జీవనం కొనగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం మంజూర్‌నగర్‌లో నివాసముంటున్న తన సోదరుడు శ్రీకర్ వద్దకు వెళ్లి వచ్చాడు. అప్పటి నుంచి ఎవరికీ కనిపించడం లేదు. ఈ క్రమంలో శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి దుర్వాసన రావడంతో స్థానికులు వెళ్లి చూడగా కృష్ణామాచారి మృతదేహం ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. ఇదిలా ఉండగా కృష్ణామాచారి మూడు రోజుల క్రితం ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్లు కనిపిస్తోంది. మెడ భాగంలో పురుగులు కనిపిస్తున్నాయి. కాగా, కృష్ణామాచారి ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు

- ప్రిన్సిపాల్స్ సమావేశంలో కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న మల్లారెడ్డి

కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని అనుబంధ డిగ్రీ కళాశాలలను తనిఖీ చేస్తామని, నిబంధనలు పాటించని వారిపై కఠినచర్యలు తీసుకుంటామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీ పరిధిలోని ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల ప్రభుత్వ, ప్రైవేట్, ఎయిడెడ్, అటానమస్, గురుకుల డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాల్స్‌తో శనివారం క్యాంపస్‌లోని పరిపాలన భవనంలోని సెనేట్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. అనుబంధ కళాశాలలు బలోపేతం కావాలన్నారు. అంతర్గత, ప్రాక్టికల్స్ పరీక్షలు తప్పనిసరిగా నిర్వహించాలన్నారు. కేయూ పరిధిలో 297 కళాశాలలకు 197 కళాశాలల బోధన సిబ్బంది వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేశారన్నారు. వివిధ కళాశాలల ప్రిన్సిపాల్స్ లేవనెత్తిన సందేహాలను రిజిస్ట్రార్ నివృత్తి చేశారు. కేయూ అకడమిక్ డీన్ జి.హనుమంతు, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్.నర్సింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ తిరుమలాదేవి, ఆడిట్ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డాక్టర్ కోల శంకర్, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఈసం నారాయణ, స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ ఆచార్య వై.వెంకయ్యతో పాటు తదితరులు పాల్గొని మాట్లాడారు.

ఆకాశంలో హరివిల్లు..



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో శనివారం సాయంత్రం చిరుజల్లులు కురిశాయి. అనంతరం ఆకాశంలో హరివిల్లు (ఇంద్రధనస్సు) ఆవిష్కృతమైంది. ఈ హరివిల్లును పిల్లలు, పెద్దలు ఆసక్తిగా తిలకించారు.

–స్టాఫ్ ఫొటో గ్రాఫర్, మహబూబాబాద్